E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON, HYDERABAD సంపుటి :01 సంచిక :337 బుధవారం 18 నవంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

ఇంటర్ బోర్డుపై సమరభేరి



- ఏకపక్ష నిర్ణయాలకు నో!
- డ్రాప్‌అవుట్ లెక్కలపై కౌంటర్!
- బాలికల కంటే బాలురే వెనుకబాటు!
- ప్రభుత్వ వైఫల్యమే కారణం!
- పేదరికం.. రవాణా సమస్యలే అడ్డంకులు!
- విద్యార్థులకు ఆర్థిక సాయం అందించాలి!
- నాణ్యమైన విద్యలో తెలంగాణ 28వ స్థానం!

న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డును ఒంటెత్తు పోకడలతో రద్దు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడలో 'ఇంటర్ బోర్డు రద్దు – తెలంగాణ విద్యపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డ్రాప్ అవుట్స్ పేరుతో ఇంటర్ బోర్డును రద్దు చేయాలనుకోవడం సరికాదని, ఈ విషయంలో ముఖ్యమంత్రి చెబుతున్న గణాంకాలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని కవిత విమర్శించారు.

మిగతాది 2 లో..

అభయహస్తం.. శూన్యహస్తం!

- హామీల అమలుపై హరీశ్ రావు ఫైర్
- కాంగ్రెస్ నయవంచనకు మూడేళ్లు
- ఆరు గ్యారెంటీల అమలేది?
- 420 హామీలపై నిలదీసిన హరీశ్
- మేనిఫెస్టో హామీలకు దిక్కేది?
- 38 క్యాబినెట్ భేటీలైనా అమలేది?
- ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన 'అభయహస్తం' మేనిఫెస్టోకు మూడేళ్లు పూర్తయింది. ఈ హామీల అమలుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. గొప్పగా చెప్పుకున్న అభయహస్తం, హామీలను అమలు చేయని మొండి హస్తంగా, శూన్య హస్తం గా మారిందని ఆరోపించారు. మేనిఫెస్టో తమకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని, దానిని తూచా తప్పకుండా అమలు చేస్తామని

2 లో

గ్యాస్ బ్లోఅవుట్ కట్టడికి భారీ ఆపరేషన్



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : కోనసీమ జిల్లాలో సంభవించిన గ్యాస్ బ్లోఅవుట్ కట్టడికి ఓఎన్‌జీసీ అధికారులు భారీ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. గ్యాస్ లీక్ అవుతున్న ప్రాంతానికి అర కిలోమీటర్ మేర భారీ శబ్దాలు వినిపిస్తున్నప్పటికీ, ఉదయంతో పోలిస్తే గ్యాస్ తీవ్రత కాస్త తగ్గిందని అధికారులు వెల్లడించారు.

2 లో

ఎన్నికల అక్రమాలపై ఎస్ఈసీ సీరియస్!


- నామినేషన్ల అడ్డంకులపై ఎస్ఈసీ సీరియస్
- ఫిర్యాదులపై తక్షణ చర్యలకు ఆదేశాలు
- కలెక్టర్, ఎస్పీల నుంచి నివేదిక కోరిన కమిషనర్
- అవసరమైన చోట ఎఫ్ఐఆర్‌ల నమోదు
- కోడుమూరు ఎస్సైపై క్రమశిక్షణ చర్యలు
- ఎస్సైకి షోకాజ్ నోటీసు జారీ
- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి.. కొన్ని చోట్ల నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం.. నామినేషన్ పత్రాలు లాక్కెళ్లడంపై పెద్ద రచ్చే జరిగింది.. అంతేకాదు.. పోలీసులు కూడా ఒక పక్షానికే మద్దతుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.. అయితే, నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎదురవుతున్న ఇబ్బందులపై ఫిర్యాదులు అందాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

2 లో

కేంద్రం హెచ్చరికతో మెటా కీలక నిర్ణయం!



- ఇన్‌స్టాగ్రామ్ రికమెండేషన్లకు కత్తెర
- అశ్లీల, హింసాత్మక కంటెంట్‌పై కఠిన నియంత్రణ
- భారత యూజర్ల కోసం అల్గారిథమ్‌లో మార్పులు
- ఫేలో కాని అకౌంట్ల పోస్టుల ప్రమోషన్‌కు బ్రేక్
- గతేడాదితో పోలిస్తే 50 శాతం తగ్గిన కంటెంట్
- తప్పుదారి పట్టించే పోస్టులపై ప్రత్యేక నిఘా
- 53 లక్షల పిల్లల వేధింపుల కంటెంట్ తొలగింపు

పోటీ కాదు.. సహకారమే ముఖ్యం!



- భారత్-ఆసియాన్ బంధం బలోపేతం కావాలి
- ఉమ్మడి భవిష్యత్తు కోసం కలిసిపని చేయాలి
- ఈస్ట్ పాలసీతో సంబంధాలకు కొత్త ఊపు
- వందకుపైగా కార్యక్రమాలు చేపట్టాం
- డిజిటల్, రక్షణ రంగాల్లో సహకారం
- అంతరిక్ష రంగంలో కొత్త అవకాశాల అన్వేషణ
- ఇండో-పసిఫిక్ శాంతికి మైత్రి కీలకం

2 లో

ఆదాయంలో హైదరాబాద్ హవా

- ఆదాయంలో హైదరాబాద్‌దే అగ్రస్థానం
- ఖర్చుల్లో రంగారెడ్డి జిల్లా టాప్
- ఆరు నెలల గణాంకాల్లో ఆసక్తికర విషయాలు
- రూ.84 వేల కోట్లకు పైగా హైదరాబాద్ ఆదాయం
- ఆదాయంలో రెండో స్థానంలో రంగారెడ్డి
- రెవెన్యూ వ్యయంలో వెనుకబడిన ములుగు, భూపాలపల్లి
- ఆదాయ వసూళ్లలో చివరి స్థానాల్లో మూడు జిల్లాలు



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాల లెక్కల్లో జిల్లాల మధ్య గణనీయమైన వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలైన ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్ర ఆదాయంలో హైదరాబాద్ కీలక వాటా కలిగి ఉండగా.. ప్రభుత్వ ఖర్చుల విషయంలో మాత్రం ఇతర జిల్లాలు ముందున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నుంచి అధిక మొత్తంలో వ్యయం నమోదవుతుండటంతో జిల్లాలవారీగా ఆదాయ, వ్యయాల మధ్య అసమానత స్పష్టమవుతోంది.

రెవెన్యూ వ్యయం విషయంలో రంగారెడ్డి జిల్లా రూ.3,428.35 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. నల్గొండ రూ.2,690.21 కోట్లు, వరంగల్ అర్బన్ రూ.2,408.59 కోట్లు, ఖమ్మం రూ.2,277.98 కోట్లు, నిజామాబాద్ రూ.2,153.36 కోట్ల వ్యయంతో తరువాతి స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు ములుగు జిల్లాలో రూ.563.79 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ.467.24 కోట్ల రెవెన్యూ వ్యయం మాత్రమే నమోదైంది. దీంతో జిల్లాల మధ్య ప్రభుత్వ ఖర్చుల పంపిణీలోనూ వ్యత్యాసాలు ఉన్నట్లు వెల్లడవుతోంది.

రాష్ట్ర రెవెన్యూ వసూళ్లలో హైదరాబాద్ జిల్లా ఏకంగా రూ.84,746.81 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లా రూ.18,486.84 కోట్ల ఆదాయంతో రెండో స్థానంలో ఉంది. రాష్ట్ర వాణిజ్య కార్యకలాపాలు, రియల్ ఎస్టేట్ లావాదేవీలు, సేవారంగ సంస్థలు, పారిశ్రామిక కార్యకలాపాలు ఈ రెండు జిల్లాల పరిధిలో ఎక్కువగా కేంద్రీకృతమై ఉండటం ఆదాయంలో ఈ వ్యత్యాసానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది

2 లో

సమ్మక్క సాగర్‌కు గ్రీన్ సిగ్నల్!

- సమ్మక్క సాగర్‌కు త్వరలో ఎన్ఓసీ
- రేవంత్‌కు ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ
- బ్యారేజీ అనుమతులకు కీలక ముందడుగు
- ప్రాజెక్టుకు సహకరిస్తామన్న ఛత్తీస్‌గఢ్
- పరిహారం చెల్లింపునకు తెలంగాణ సిద్ధం
- గిరిజన ప్రాంతాలకు సాగు, తాగునీటి భరోసా
- ఎల్‌నినో నేపథ్యంలో నీటి నిల్వపై దృష్టి

2 లో

తెరచుకున్న అయ్యప్ప ఆలయ ద్వారాలు!

- శబరిమలలో ప్రారంభమైన మండల యాత్ర
- అయ్యప్ప ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణ
- రెండు నెలల పాటు ప్రత్యేక దర్శనాలు
- రోజుకు 80 వేల మందికి దర్శనం
- భక్తుల రద్దీపై ఏఐ కెమెరాల నిఘా
- డిసెంబర్ 27న మండల పూజ
- జనవరి 14న మకరవిళక్కు మహోత్సవం



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో వార్షిక మండల-మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్ వైభవంగా ప్రారంభమైంది. మలయాళ క్యాలెండర్ ప్రకారం వృశ్చిక మాసం ఆరంభం సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచారు. తొలి రోజే వేలాది మంది భక్తులు తరలిరావడంతో శబరిమల కొండలు 'స్వామియే శరణం అయ్యప్ప' నామస్మరణతో మార్మోగాయి. అంతకుముందు సోమవారం సాయంత్రం నుంచి ఆలయంలో సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు. నూతన ప్రధాన అర్చకుడు అరీక్కర సుబ్రమణియన్ శంకరన్ నంబూద్రి అయ్యప్ప ఆలయ ద్వారాలను తెరిచి

2 లో

భారత్ సమ్మిట్ వివాదం సుప్రీంకోర్టుకు!

- తెలంగాణ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్
- విదేశీ నేత వ్యాఖ్యలపై న్యాయపోరాటం
- వీసా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి
- కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యంపై అభ్యంతరం
- పిటిషన్‌పై త్వరలో విచారణ చేపట్టే అవకాశం
- ఇటాలియన్ ప్రతినిధి వ్యాఖ్యలతో వివాదం
- భారత్ సమ్మిట్ వ్యవహారంపై సర్వత్రా చర్చ

2 లో

తెలంగాణ విద్యుత్‌లో ఆల్‌టైమ్ రికార్డ్!

- 20 వేల మెగావాట్లు దాటిన పీక్ డిమాండ్
- రాష్ట్ర చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డు
- గతేడాదితో పోలిస్తే 50 శాతం పెరుగుదల
- విద్యుత్ సరఫరాలో సర్కార్ సత్తా
- కొత్త సబ్‌స్టేషన్లతో విద్యుత్ వ్యవస్థ బలోపేతం
- రబీ సీజన్‌కు విద్యుత్ శాఖ సన్నద్ధం
- రైతులు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ లక్ష్యం

2 లో

సమ్మక్క సాగర్‌కు గ్రీన్ సిగ్నల్!



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి ఎన్ఓసీ మంజూరు చేసే విషయంలో కీలక ముందడుగు పడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్‌తో సమావేశమయ్యారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు వెంటనే ఎన్ఓసీ జారీ చేయడంతో పాటు మిగిలిన అనుమతుల ప్రక్రియకూ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ సానుకూలంగా స్పందిస్తూ, ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎల్‌నినో దృష్ట్యా నీటి నిల్వ కీలకం:

సమావేశంలో భాగంగా ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఇందులో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. పూర్తి స్థాయి నీటి మట్టం (+83 మీటర్లు) వద్ద ఈ బ్యారేజీ నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలుగా ఉందని, కరువు ప్రభావిత, వెనుకబడిన గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ముంపు తగ్గింపునకు స్థల మార్పు.. ఐఐటీ నివేదిక:

సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద ప్రతిపాదించగా, అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురవడంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు, భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని గుర్తించారు. ఈ ముంపును భారీగా తగ్గించేందుకే బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చినట్లు సీఎం వివరించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద ఛత్తీస్‌గఢ్ భూభాగంలో కేవలం 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతుందని, భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని స్పష్టమైంది. ఈ అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ. 9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించగా, ఐఐటీ ఖరగ్‌పూర్ జూలై 30న తన నివేదికను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది.

పరిహారం చెల్లింపునకు తెలంగాణ సిద్ధం:

ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఎన్ఓసీని త్వరగా జారీ చేసి, ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. తాజా భేటీలో ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూల హామీ ఇవ్వడంతో సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు త్వరలోనే మార్గం సుగమం కానుంది.

ఇంటర్ బోర్డుపై సమరభేరి!

మొదటి పేజీ తరువాయి

ఎన్నో ఏళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న విద్యా విధానంలో కీలక మార్పులు చేస్తున్నప్పుడు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం కచ్చితంగా చర్చించాలని కవిత డిమాండ్ చేశారు. 'ప్రభుత్వాన్ని ఏదైనా ప్రశ్నిస్తే ఎదురుదాడి చేసే పరిస్థితి నెలకొంది. అందుకే మేధావులు, విద్యావేత్తల అభిప్రాయాలను సమాజానికి తెలియజేసేందుకే మేమే ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశాం' అని ఆమె పేర్కొన్నారు. పరిపాలనా సంస్కరణలు, విద్యా సంస్కరణలు ప్రభుత్వం భ్రమపడకూడదని హితవు పలికారు.

డ్రాప్ అవుట్ లెక్కలపై కవిత కౌంటర్..

పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్‌లో చేరుతున్న వారిలో పది మందిలో ఆరుగురు మాత్రమే ఉంటున్నారని, డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నాయన్న ఒకే కారణంతో బోర్డును రద్దు చేస్తామని సీఎం చెప్పడాన్ని కవిత తప్పుబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల లెక్క అలా ఉండి ఉండొచ్చు కానీ, రాష్ట్రవ్యాప్తంగా ఓవరాల్‌గా చూస్తే డ్రాప్ అవుట్స్ కేవలం 16 శాతం మాత్రమే ఉన్నాయని ఆమె వివరించారు. ప్రభుత్వ బడుల్లో పదో తరగతి పూర్తి చేసిన వారు ప్రైవేట్ కాలేజీల్లోనో, ఇతర కోర్సుల్లోనో చేరుతున్నారని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు.

అమ్మాయిలు కాదు... అబ్బాయిలే ఎక్కువ..

పదో తరగతి నుంచి ఇంటర్‌కు వెళ్లేవారిలో బాలికలే ఎక్కువగా డ్రాప్ అవుట్ అవుతున్నారని సీఎం చెప్పడం అవాస్తవమని కవిత అన్నారు. 'ముఖ్యమంత్రి హోదాలో ఉండి అబద్ధాలు చెప్పవద్దు. ఇంటర్‌కు వెళ్తున్న బాలికల సంఖ్య 77.4 శాతంగా ఉంటే, బాలుర సంఖ్య 68.4 శాతం మాత్రమే ఉంది. అంటే అబ్బాయిలే ఎక్కువగా చదువుకు దూరమవుతున్నారు. అంతేకాదు, ఇంటర్‌లో ఫెయిల్ అవుతున్న వారిలో 51 శాతం అబ్బాయిలే ఉన్నారు. గంజాయి వంటి వ్యసనాలకు బానిసే కావడం, చదువుపై నిర్లక్ష్యం ఇందుకు కారణం. ప్రభుత్వం అబ్బాయిల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి అని సూచించారు. పేదరికం (డబ్బులు లేకపోవడం), గ్రామాల్లో సరైన బస్సు సౌకర్యం లేకపోవడం వంటి కారణాలతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఎక్కువగా చదువు మానేస్తున్నారని నీతి ఆయోగ్ నివేదికలు సైతం స్పష్టం చేశాయని కవిత గుర్తుచేశారు. డ్రాప్ అవుట్స్ నివారణకు గుజరాత్ ప్రభుత్వం 'నమో లక్ష్మి' పథకం ద్వారా ఏటా రూ. 928 కోట్లను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తోందని, దీనివల్ల అక్కడ డ్రాప్ అవుట్స్ 16 శాతం తగ్గాయని తెలిపారు. తెలంగాణలోనూ అలాంటి ఆర్థిక సాయం అందించే పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్యలో 28వ స్థానం..

ఒకటి నుంచి పదో తరగతి వరకు డ్రాప్ అవుట్స్ లేని ర్యాంకింగ్స్‌లో తెలంగాణ టాప్-5లో ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్యను అందించడంలో మాత్రం దేశంలో 28వ స్థానంలో ఉండేటం ఆందోళనకరమని కవిత అన్నారు. ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని తాము పూర్తిగా వ్యతిరేకించడం లేదని, అయితే ఇలాంటి వ్యవస్థాగత మార్పులు జరగాలంటే 3 నుంచి 10 ఏళ్ల సుదీర్ఘ ప్రక్రియ అవసరమని స్పష్టం చేశారు. ఆర్థికంగా, విధానపరంగా ప్రభుత్వ పూర్తి మద్దతు లేకుండా ఏకపక్షంగా ముందుకెళ్తే ఊరుకునేది లేదని కవిత హెచ్చరించారు.

భారత్ సమ్మిట్ వివాదం సుప్రీంకోర్టుకు!



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : తెలంగాణలో జరిగిన 'భారత్ సమ్మిట్' వేదికగా ఒక విదేశీ నేత చేసిన వ్యాఖ్యల వివాదం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. భారత్ సమ్మిట్‌లో విదేశీ ప్రతినిధి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నైతిక బాధ్యత వహిస్తూ తెలంగాణ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని పిటిషనర్ తన వ్యాజ్యంలో అభ్యర్థించారు.

అలాగే భారత్ పర్యటనకు వచ్చే విదేశీ రాజకీయ ప్రతినిధులు, అతిథులు వీసా నిబంధనలను ఉల్లంఘించి దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకునేలా వ్యాఖ్యలు చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు త్వరలోనే విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే హైదరాబాద్ వేదికగా జరిగిన భారత్ సమ్మిట్ పాల్గొన్న యూరోపియన్ సోషలిస్టు అండ్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఇటాలియన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

తెలంగాణ విద్యుత్‌లో ఆల్‌టైమ్ రికార్డ్!



న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : ప్రతికూల వాతావరణ పరిస్థితులు, జలవిద్యుత్ ఉత్పత్తిలో దాదాపు 4,000 మెగావాట్ల లోటు ఏర్పడినప్పటికీ తెలంగాణ రాష్ట్రం పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా గరిష్ట విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్ల మైలురాయిని దాటింది. సోమవారం (నవంబర్ 16) రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 20,018 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదై సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును నెలకొల్పింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సోషల్ మీడియా వేదికగా 'తెలంగాణ పవర్ రిపోర్ట్' వివరాలను వెల్లడించారు.

గతేడాది కంటే 50.2 శాతం పెరిగిన డిమాండ్:

నవంబర్ 16 నాటి గణాంకాల ప్రకారం, గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఏకంగా 50.2 శాతం పెరిగింది. నవంబర్ 2025 డిమాండ్ 8,522 మెగావాట్లు నమోదు కాగా నవంబర్ 2026 డిమాండ్ 12,802 మెగావాట్లు కాగా ఈ ఏడాది అదనంగా సరఫరా చేసిన విద్యుత్ 4,280 మెగావాట్లు అని భట్టి పేర్కొన్నారు.

2 కొత్త సబ్‌స్టేషన్లతో మరింత బలోపేతం:

రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగా దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన 2 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మరింత వెసులుబాటు కలగనుంది.

రబీ సీజన్‌కు పక్కా ప్రణాళిక:

రాబోయే రబీ 2026-27 సీజన్‌లో వ్యవసాయ రంగానికి విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశం ఉన్నందున, అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ లభ్యతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ప్రతి ఇంటికి, రైతుకు మరియు పరిశ్రమలకు ఎటువంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.

తెరచుకున్న అయ్యప్ప ఆలయ ద్వారాలు!

మొదటి పేజీ తరువాయి

అదే సమయంలో మాలికప్పురం ఆలయ ద్వారాలను నూతన ప్రధాన అర్చకుడు ఏ. దామోదరన్ నంబూద్రి తెరిచి పూజాదికాలు నిర్వహించారు.

రానున్న రెండు నెలల పాటు కొనసాగే ఈ తీర్థయాత్రకు భక్తుల రద్దీ భారీగా ఉంటుందన్న అంచనాతో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, పోలీసు యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేశాయి. రోజుకు గరిష్ఠంగా 80 వేల మంది భక్తులకు దర్శనం కల్పించాలని నిర్ణయించగా, ఇప్పటికే వర్చువల్ క్యూ ద్వారా 66 వేల మంది, స్పాట్ బుకింగ్ ద్వారా మరో 14 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఆలయంలోని 18 పవిత్ర మెట్ల వద్ద రద్దీని నియంత్రించేందుకు నిమిషానికి సుమారు 75 మంది భక్తులు మెట్లు ఎక్కేలా పోలీసులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్ టికెట్లు లేని భక్తుల కోసం ప్రధాన బేస్ క్యాంప్ నీలక్కల్‌తో పాటు ఎరుమేలి, వండిపెరియార్ సమీపంలోని సత్రం ప్రాంతాల్లో స్పాట్ బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంపా నదీ తీరంలో రద్దీ పెరగకుండా ఉండేందుకు అక్కడ స్పాట్ బుకింగ్ నిలిపివేశారు.

యాత్రికుల భద్రత, రద్దీ పర్యవేక్షణ కోసం నీలక్కల్ పార్కింగ్ ప్రాంతం నుంచి ఆలయం వరకు భక్తుల కదలికలను గమనించేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలను వినియోగిస్తున్నారు. ఆలయ పరిసరాల్లో మెరుగైన లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు కే. జయకుమార్ తెలిపారు. మంగళవారం అన్ని శాఖలతో సమీక్ష నిర్వహించిన ఆయన, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. కాగా, ఈ మండల తీర్థయాత్ర డిసెంబర్ 27న జరిగే మండల పూజతో ముగియనుండగా, అదే రోజు ఆలయాన్ని మూసివేస్తారు. తిరిగి మకరవిళక్కు యాత్ర కోసం డిసెంబర్ 30 సాయంత్రం 5 గంటలకు ద్వారాలు తెరుస్తారు. జనవరి 14న మకరవిళక్కు మహోత్సవం జరగనుండగా, జనవరి 19 వరకు భక్తులకు దర్శనం కల్పించి, జనవరి 20న ఆలయాన్ని మూసివేయనున్నారు.

పోటీ కాదు.. సహకారమే ముఖ్యం!

న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : దేశాల మధ్య పోటీ అవసరమే అయినప్పటికీ, అది ఆరోగ్యకరమైన రీతిలో ఉండాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. కేవలం పోటీతో కాకుండా, పరస్పర సహకారంతోనే మన ఉమ్మడి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ, మంగళవారం జరిగిన 23వ భారత్ –ఆసియాన్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొని కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారత్, ఆసియాన్ దేశాలు కలిసి ప్రపంచ జనాభాలో నాలుగో వంతుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని గుర్తుచేశారు. గత కొన్నేళ్లుగా ప్రపంచం అనేక తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచానికి శాంతి, స్థిరత్వంతో పాటు ఊహించదగిన (స్థిరమైన) భవిష్యత్తు అత్యంత అవసరం. మనందరం కలిసిగట్టుగా పనిచేస్తే శాంతి, స్థిరత్వాలకు ఒక గొప్ప ప్రతీకగా నిలవగలం అని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈస్ట్ పాలసీ యాక్ట్‌తో సంబంధాలకు కొత్త ఊపు..

భారత్ అనుసరిస్తున్న ఈస్ట్ పాలసీ యాక్ట్ ద్వారా భారత్ ఆసియాన్ సంబంధాలకు కొత్త ఊపు లభించిందని ప్రధాని పేర్కొన్నారు. మన భాగస్వామ్యం కేవలం ఉమ్మడి సంస్కృతి, వారసత్వానికి మాత్రమే పరిమితం కాకుండా, అంతకుమించి సమగ్రంగా పనిచేస్తోందని తెలిపారు. ఇరు ప్రాంతాల ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఇప్పటివరకు 100కు పైగా వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు ఆయన వివరించారు.

కొత్త రంగాల్లో సహకార అన్వేషణ..

సాంప్రదాయ రంగాలతో పాటు ఆధునిక సాంకేతికతపైనా ఇరుపక్షాలు దృష్టి సారించాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, అంతరిక్ష రంగాల్లో పరస్పర సహకారం కోసం కొత్త కోణాలను అన్వేషిస్తున్నట్లు మోదీ వెల్లడించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం భారత్–ఆసియాన్ మైత్రి కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

అభయహస్తం.. శూన్యహస్తం!

మొదటి పేజీ తరువాయి

మూడేళ్ల క్రితం ఇదే రోజు మల్లికార్జున ఖర్గే సమక్షంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు.

మూడేళ్లు గడిచినా ఆ హామీలకు దిక్కులేదని, అమలు ఊసే లేదని ఆయన విమర్శించారు. ఓట్లు వేసిన ప్రజలనే కాకుండా, ఓట్లు వేసి దేవుళ్లను, పవిత్ర గ్రంథాలను సైతం మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆరోపించారు. గాంధీ భవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ప్రజలకు సమాధానం చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. తొలి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలిందని, ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ఆయన ప్రశ్నించారు.ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క హామీకి తూట్లు పొడిచారని మండిపడ్డారు. గాంధీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే కాంగ్రెస్, గాంధీ భవన్ సాక్షిగా ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేకపోవడం సిగ్గుచేటని, కాంగ్రెస్ వైఖరి చూస్తే గాంధీ ఆత్మ కూడా క్షోభిస్తుందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. హామీలు అమలు చేయకుండా మూడేళ్లుగా ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ సాధించిన ఘనత అని, వారి నయవంచనను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారని, తగిన గుణపాఠం చెప్పడమే మిగిలి ఉందని హరీశ్ రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

గ్యాస్ బ్లోఅవుట్ కట్టడికి భారీ ఆపరేషన్

మొదటి పేజీ తరువాయి

నాలుగు ఫైరింజన్ల సాయంతో నీటిని విరజిమ్ముతూ గ్యాస్ పీడనాన్ని తగ్గించేందుకు సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ సహాయక చర్యలకు నీటి కొరత ఏర్పడకుండా ఉండేందుకు గన్నవరం కాలువ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గ్యాస్ బావి ముఖద్వారం పటిష్టంగానే ఉందని, భూమికి సమీపంలో గ్యాస్ వ్యాపించకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఓఎన్‌జీసీ సిబ్బంది తెలిపారు.

ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ఘటనా స్థలంలో డీజిల్ జనరేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేశారు. గ్యాస్ బావి లీకేజీని శాశ్వతంగా అరికట్టేందుకు ప్రత్యేక 'సిమెంటింగ్ బృందం' ఘటనా స్థలానికి చేరుకుంటోందని, మరో 4 నుంచి 5 గంటల్లో పరిస్థితిని పూర్తిగా అదుపులోకి తీసుకువస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, గ్యాస్ లీక్ తీవ్రత దృష్ట్యా ముందుజాగ్రత్త చర్యగా గెద్దాడ నుంచి కొండాలమ్మచింత వరకు జాతీయ రహదారిని పోలీసులు పూర్తిగా మూసివేశారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా కొండాలమ్మచింత మీదుగా నగరం గ్రామం వైపు నుంచి ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, కోనసీమ జిల్లాలో చోటుచేసుకున్న ఈ బ్లోఅవుట్ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. ఘటనా స్థలానికి సమీపంలోని ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో వరుసగా బ్లోఅవుట్ ఘటనలు పునరావృతమవుతున్న నేపథ్యంలో, తక్షణమే పూర్తిస్థాయి 'సేఫ్టీ ఆడిట్' నిర్వహించాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికల అక్రమాలపై ఎస్ఈసీ సీరియస్!

మొదటి పేజీ తరువాయి

ఈ వ్యవహారాలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఎన్‌టీవీ ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పలు కీలక విషయాలను వివరించారు.

రాయచోటికి సంబంధించిన అంశంపై జిల్లా కలెక్టర్, ఎస్పీలను నివేదిక ఇవ్వాలని కోరినట్లు అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఈ మేరకు స్థానిక కలెక్టర్, ఎస్పీలకు వెంటనే ఆదేశాలు జారీ చేశామన్నారు. అవసరమైన చోట ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.

మరోవైపు కర్నూలు జిల్లా కోడుమూరు ఎస్సైపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎస్ఈసీ తెలిపారు. ఇప్పటికే సంబంధిత ఎస్సైకి జిల్లా ఎస్పీ షోకాజ్ నోటీసు జారీ చేశారని వెల్లడించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి చర్యలు ఉంటాయని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఇక, ఎన్నికల్లో ఏకగ్రీవాల అంశంపై స్పందిస్తూ.. వార్డుల స్థాయిలో ఏకగ్రీవాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందని అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. అయితే ఇప్పటివరకు ఎన్ని ఏకగ్రీవాలు జరిగాయనే దానిపై పూర్తి వివరాలు రావాల్సి ఉందన్నారు. సంబంధిత అధికారుల నుంచి నివేదిక అందిన తర్వాత ఏకగ్రీవాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. మొత్తంగా నామినేషన్ల సమయంలో వస్తున్న ఫిర్యాదులు, అధికారులపై చర్యలు, ఏకగ్రీవాల వివరాలపై ఎస్ఈసీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

కేంద్రం హెచ్చరికతో మెటా కీలక నిర్ణయం!

న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : భారత్‌లో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై కేంద్ర ప్రభుత్వం పర్యవేక్షణను కఠినతరం చేసిన నేపథ్యంలో 'మెటా' కీలక నిర్ణయం తీసుకుంది. భారత వినియోగదారులకు ఇన్‌స్టాగ్రామ్‌లో అశ్లీలతను ప్రేరేపించే, హింసాత్మక కంటెంట్ రికమెండేషన్లను తగ్గించేందుకు తన అల్గారిథమ్ వ్యవస్థలో మార్పులు చేసినట్లు మంగళవారం ప్రకటించింది. అయితే ఇది కంటెంట్‌పై పూర్తిస్థాయి నిషేధం కాదని, కేవలం వినియోగదారులు ఫాలో అవ్వని అకౌంట్ల నుంచి వచ్చే అలాంటి పోస్టులను ఇతరులకు ప్రమోట్ చేయడాన్ని మాత్రమే నియంత్రిస్తుందని స్పష్టం చేసింది. డిఫాల్ట్ భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం వల్ల గతేడాదితో పోలిస్తే భారత్‌లో ఇలాంటి రికమెండెడ్ కంటెంట్ సగానికి సగం తగ్గిందని సంస్థ తెలిపింది.

కేంద్రం అడ్వైజరీ నేపథ్యంలో..

హింసను ప్రేరేపించే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పోస్టుల రికమెండేషన్ వ్యవస్థను సమీక్షించాలని గత నెల (అక్టోబర్ 10న) కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ మెటాకు అడ్వైజరీ జారీ చేసింది. తప్పుదారి పట్టించే కంటెంట్‌కు విపరీతమైన ప్రచారం లభించకుండా చూడాలని ఆదేశించింది. తాజా మార్పులను మెటా నేరుగా ప్రభుత్వ ఆదేశాలతో ముడిపెట్టకపోయినప్పటికీ, కేంద్రం ఒత్తిడి వల్లే ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

'సేఫ్ హార్బర్' రక్షణ కోల్పోతారన్న హెచ్చరికలు:

మరోవైపు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పిల్లల లైంగిక వేధింపుల కంటెంట్ కట్టడి చేయకపోతే 'సేఫ్ హార్బర్' చట్టపరమైన రక్షణ కోల్పోయే ప్రమాదం ఉందని కేంద్రం ఇదివరకే హెచ్చరించింది. ఈ అంశంపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎదుట మెటా ఇండియా చీఫ్ అరుణ్ శ్రీనివాస్ హాజరై వివరణ కూడా ఇచ్చారు. కాగా, 2026 జనవరి నుండి జూన్ మధ్య భారత్‌లో 53 లక్షల పిల్లల లైంగిక వేధింపుల కంటెంట్‌ను తొలగించామని, అందులో 98 శాతానికి పైగా ముందస్తుగానే గుర్తించి చర్యలు తీసుకున్నామని మెటా ఇటీవల వెల్లడించింది.

ఆదాయంలో హైదరాబాద్ హవా

న్యూస్ డెస్క్, 17 నవంబర్ తెలుగు గళం న్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాల లెక్కల్లో జిల్లాల మధ్య గణనీయమైన వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలైన ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్ర ఆదాయంలో హైదరాబాద్ కీలక వాటా కలిగి ఉండగా.. ప్రభుత్వ ఖర్చుల విషయంలో మాత్రం ఇతర జిల్లాలు ముందున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నుంచి అధిక మొత్తంలో వ్యయం నమోదవుతుండటంతో జిల్లాలవారీగా ఆదాయ, వ్యయాల మధ్య అసమానత స్పష్టమవుతోంది.

రెవెన్యూ వ్యయం విషయంలో రంగారెడ్డి జిల్లా రూ.3,428.35 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. నల్గొండ రూ.2,690.21 కోట్లు, వరంగల్ అర్బన్ రూ.2,408.59 కోట్లు, ఖమ్మం ర

రెండేళ్లు గడుస్తున్నా మారని స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిస్థితులు!

▸▸మెయిన్ రోడ్లు శుభ్రం చేసి గొప్పలు చెప్పుకోవడమేనా? కాలనీల్లో పారిశుద్ధ్యం గాలికి! ▸▸ప్రజా సమస్యలు పట్టించుకోని మున్సిపల్ కమిషనర్.. ఫిర్యాదు చేసినా స్పందన కరువు

▸▸అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సీపీఐ మండల కార్యదర్శి తోట రమేష్ ఘాటు విమర్శలు







జనగామ/స్టేషన్ ఘన్‌పూర్ నవంబర్ 17 (తెలుగు గళం)

మున్సిపాలిటీగా ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదని, ప్రజా సమస్యల పరిష్కారంలో మున్సిపల్ కమిషనర్ ఏమాత్రం చొరవ చూపడం లేదని సీపీఐ స్టేషన్ ఘన్‌పూర్ మండల కార్యదర్శి తోట రమేష్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మున్సిపాలిటీగా మారితే పట్టణ రూపురేఖలు మారుతాయని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో శివునిపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, చాగల్లు గ్రామాలు గ్రామపంచాయతీలుగా ఉన్న సమయంలో ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా సంబంధిత సర్పంచ్ లేదా పంచాయతీ కార్యదర్శికి తెలియజేస్తే వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకునేవారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా కనీస స్పందన ఉండటం లేదని ఆరోపించారు. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రజల గోడు వినేవారే లేకుండా పోయారని మండిపడ్డారు.

మెయిన్ రోడ్లు శుభ్రం చేస్తే మున్సిపాలిటీ మొత్తం పరిశుభ్రమైనట్లా?

మున్సిపల్ కమిషనర్ కేవలం ప్రధాన రహదారులను మాత్రమే శుభ్రం చేయించి, పట్టణమంతా ఎంతో అభివృద్ధి చేసినట్లు, పారిశుద్ధ్య నిర్వహణలో అద్భుతాలు సాధించినట్లు గొప్పలు చెప్పుకుంటూ ఫోజులిస్తున్నారని తోట రమేష్ విమర్శించారు. ప్రధాన రహదారులకే పరిమితమైన పారిశుద్ధ్య కార్యక్రమాలతో మున్సిపాలిటీ మొత్తం పరిశుభ్రంగా మారినట్లు ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు సమస్యలు అంతర్గత వీధుల్లో, కాలనీల్లో ఉన్నాయని, అక్కడ పేరుకుపోతున్న చెత్త, పూడుకుపోయిన మురుగు కాలువలు, నిలిచిపోతున్న మురుగునీరు కమిషనర్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఫొటోలకు ఫోజులివ్వడం, ప్రచారం చేసుకోవడం కంటే ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. మున్సిపాలిటీ అంటే కేవలం మెయిన్ రోడ్లు మాత్రమే కాదని, ప్రతి కాలనీ, ప్రతి వీధి, ప్రతి వార్డుకు సమానంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు.

పారిశుద్ధ్యం పడకేసింది.. ప్రజారోగ్యంపై పట్టింపు లేదా?

మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా గాడి తప్పిందని రమేష్ విమర్శించారు. పలు కాలనీలు, వీధులు, అంతర్గత రహదారుల పక్కన చెత్త పేరుకుపోవడం, చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడం, మురుగునీటి కాలువలు పూడుకుపోయి దుర్వాసన వెదజల్లడం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దోమల వ్యాప్తికి కారణమవుతోందని పేర్కొన్నారు.వర్షాకాలంలో వర్షపు నీరు, మురుగునీరు రోడ్లపై నిలిచిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. చెత్త తొలగింపు, కాలువల శుభ్రత, దోమల నివారణ వంటి కనీస కార్యక్రమాలైనా నిర్లక్ష్యం కనిపిస్తోందని, ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు.

పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా పరికరాలు ఏవి?

ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస భద్రతా పరికరాలు అందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని రమేష్ అన్నారు. మురుగు కాలువల్లో పనిచేసే కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, రక్షణ బూట్లు, యూనిఫారాలు, ఇతర భద్రతా పరికరాలు అందించాల్సి ఉన్నప్పటికీ వాటిని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల ఆరోగ్యం, ప్రాణ భద్రతపై మున్సిపల్ యంత్రాంగానికి కనీస బాధ్యత లేదా అని నిలదీశారు.

వీధిలైట్లు వెలగవు.. రోడ్లు బాగుపడవు.. తాగునీటి సమస్యలు తీరవు!

పట్టణంలోని అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు సక్రమంగా పనిచేయక రాత్రివేళ ప్రజలు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాడైన వీధిలైట్లను వెంటనే మరమ్మతు చేయాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌పై ఉందన్నారు.అంతర్గత రహదారులపై గుంతలు ఏర్పడినా మరమ్మతులు చేపట్టడం లేదని, కొన్ని ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా తాగునీటి సరఫరాలో అంతరాయాలు, పైపులైన్ లీకేజీలు, నీటి ట్యాంకుల శుభ్రత, మంచినీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు.మురుగునీటి కాలువలు, తాగునీటి పైపులైన్లు కలిసిపోయే ప్రమాదం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూడటంతో పాటు ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా నియంత్రించాలని, వీధికుక్కలు, పందుల బెడదను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజా సమస్యలపై కమిషనర్‌కు బాధ్యత లేదా?

ప్రజలు తమ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం బాధాకరమని తోట రమేష్ అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవాల్సిన అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును పర్యవేక్షించి, ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత కమిషనర్‌పై ఉందన్నారు. కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు సమాధానం చెప్పాలి.. సమస్యలకు పరిష్కారం చూపాలి!

మున్సిపాలిటీ ఏర్పడి రెండేళ్లు గడిచినా ప్రజలకు కనిపించే అభివృద్ధి ఏమిటో మున్సిపల్ కమిషనర్ సమాధానం చెప్పాలని తోట రమేష్ డిమాండ్ చేశారు. శివునిపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, చాగల్లు



ప్రాంతాల్లోని ప్రజలకు సమానంగా అభివృద్ధి, పారిశుద్ధ్య సేవలు అందించాలని, వార్డుల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు.ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్య వైఖరిని విడనాడి ప్రజలకు అందుబాటులో ఉండాలని, పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా పరికరాలు వెంటనే అందించాలని, చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణ, వీధిలైట్ల మరమ్మతులు, తాగునీటి సమస్యలు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ ఉత్తర్వులంటే స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ కమిషనర్‌కు లెక్క లేదా?

- కలెక్టర్ ఆదేశాలకే బేఖాతరు..నిరుపేదకు న్యాయం చేయడంలో అధికారుల నిర్లక్ష్యం!
- 15 ఏళ్లుగా జీవనోపాధి పొందిన వ్యక్తిని ఖాళీ చేయించి..అదే స్థలంలో ఇతరులకు అవకాశం ఇచ్చారా?
- తన సామాన్లు, బీరువాల తయారీ యంత్రాల కోసం బాధితుడి పోరాటం..
- మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్లిపోయిన కమిషనర్ రాధా కృష్ణ!

జనగామ/స్టేషన్ ఘనపూర్(తెలుగు గళం)

ప్రభుత్వ భూమి పేరుతో నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీసే అధికారులు, అదే స్థలంలో ఇతరులు ఉంటున్నారనే ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు? జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులకే అమలు లేకపోతే సామాన్య ప్రజలకు న్యాయం జరిగేదెలా? స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో చోటుచేసుకున్న ఈ వ్యవహారం మున్సిపల్ అధికారుల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 638 సర్వే నంబర్‌లో ఉన్న సుమారు 200 చదరపు గజాల స్థలంలో చిలుముల భాస్కర్ అనే నిరుపేద వ్యక్తి గత 15 సంవత్సరాలుగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని బీరువాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కష్టపడి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు సుమారు రెండేళ్ల క్రితం మున్సిపల్ అధికారుల నుంచి ఊహించని పరిస్థితి ఎదురైంది. సదరు స్థలం ప్రభుత్వ భూమి అని, అందులో ఏర్పాటు చేసుకున్న షెడ్డు ఖాళీ చేయాలని అధికారులు సూచించడంతో బీరువాల తయారీ పనులను నిలిపివేసినట్లు భాస్కర్ తెలిపారు.అధికారుల మాటను గౌరవించి స్థలాన్ని ఖాళీ చేసేందుకు సిద్ధపడినప్పటికీ, తనకు సంబంధించిన సామాన్లు, బీరువాల తయారీ యంత్రాలు, ఇతర వస్తువులు షెడ్డు వద్దనే ఉన్నాయని చెప్పారు.అయితే ఈలోగా కొందరు వ్యక్తులు అక్కడికి వచ్చి తన సామాన్లు ఉండగానే అదే షెడ్డు ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలం అని చెప్పి తనను ఖాళీ చేయించిన అధికారులు, అదే స్థలంలో ఇతర వ్యక్తులు ఎలా ఉంటున్నారన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

నిరుపేదకు ఒక న్యాయం..ఇతరులకు మరో న్యాయమా?

ప్రభుత్వ స్థలం అని చెప్పినప్పుడు తాను ఎలాంటి అభ్యంతరం చెప్పకుండా ఖాళీ చేయడానికి సిద్ధపడ్డానని, కానీ తన జీవనోపాధికి సంబంధించిన వస్తువులను మాత్రం తిరిగి ఇప్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని భాస్కర్ ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఆ స్థలం ప్రభుత్వానిదే అయితే అందులో ఎవరూ ఉండకూడదని, తనను మాత్రమే ఖాళీ చేయించి ఇతరులకు అక్కడ నివాసం ఉండే అవకాశం కల్పించడం వెనుక అధికారుల ఉద్దేశం ఏమిటో వెల్లడించాలని కోరుతున్నారు.ఈ స్థలం ప్రభుత్వ భూమి అని తెలియకముందు చింత లక్ష్మి,అంబటి సత్యనారాయణ రాజు, జయేంద్ర రాజులకు నెలకు రూ.5,000 చొప్పున అద్దె చెల్లించేవాడినని భాస్కర్ వెల్లడించారు.అనంతరం మున్సిపల్ అధికారులు ప్రభుత్వ స్థలమని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లేందుకు సిద్ధపడ్డానని తెలిపారు. అయితే తాను కష్టపడి కొనుగోలు చేసుకున్న బీరువాల తయారీ యంత్రాలు, ఇతర సామాన్ల మాత్రం తనకు దక్కకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..ఉత్తర్వులు జారీ అయినా ఫలితం శూన్యమా?

ఈ సమస్యపై బాధితుడు గత నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు జరిగిన అన్యాయాన్ని వివరించడంతో జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ స్థాయిలో సమస్యపై స్పందన వచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కలెక్టర్ ఉత్తర్వుల అమలుపై మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించి, తన షెడ్డు వద్ద ఉన్న సామాన్లు, బీరువాల తయారీ యంత్రాలను ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. దీనికి పోలీసు ప్రొటెక్షన్ తీసుకొని ఇప్పిస్తానని కమిషనర్ చెప్పినట్లు పేర్కొన్నారు.అయితే పోలీసు రక్షణ కోసం సీఐని సంప్రదించగా, మున్సిపల్ కమిషనర్ వద్దకు వెళ్లాలని, మరోవైపు కమిషనర్ పోలీసు రక్షణ తానే తెచ్చుకోవాలని చెబుతున్నారని భాస్కర్ వాపోయారు.ఇలా మున్సిపల్ అధికారులు, పోలీసుల మధ్య బాధితుడిని తిప్పించుకుంటూ సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఒక నిరుపేద వ్యక్తి తన కష్టార్జితంతో కొనుగోలు చేసుకున్న యంత్రాలు, సామాన్లను తిరిగి పొందడానికి ఇన్ని రోజులుగా అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి రావడం విచారకరం.

చింత లక్ష్మి, చింత ఏలియాపై ఆక్రమణ ఆరోపణలు.. అధికారుల మౌనం ఎందుకు?

ప్రస్తుతం చింత లక్ష్మి, చింత ఏలియా అనే వ్యక్తులు సదరు స్థలాన్ని ఆక్రమించుకొని ఉంటున్నారని భాస్కర్ ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలం అని చెప్పి తనను ఖాళీ చేయించినప్పుడు, అదే స్థలంలో ఇతరులు ఉండటాన్ని అధికారులు ఎలా అనుమతిస్తున్నారనే ప్రశ్న ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఆరోపణలపై మున్సిపల్ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూమి అయితే దాని పరిరక్షణ బాధ్యత మున్సిపల్ అధికారులదే కదా? మరి ఒకరిని ఖాళీ చేయించి మరొకరు అక్కడ ఉండటానికి అవకాశం ఎలా ఏర్పడిందన్నది తేలాల్సి ఉంది.

మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్లిపోయిన కమిషనర్!

ఈ వ్యవహారంపై వాస్తవాలు తెలుసుకునేందుకు మీడియా ప్రతినిధులు



మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరారు. అయితే బాధితుడి ఆరోపణలపై గానీ, జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై గానీ కమిషనర్ ఎలాంటి స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు.మీడియా ప్రతినిధులు ప్రశ్నిస్తున్న సమయంలో కలెక్టర్‌తో మీటింగ్ ఉందా అంటూ మాట దాటవేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఒక నిరుపేద వ్యక్తి తన జీవనోపాధిని కోల్పోయి, తన సామాన్లు తనకు ఇప్పించాలని వేడుకుంటున్నప్పుడు బాధ్యతాయుతమైన అధికారి కనీసం వివరణ ఇవ్వకుండానే వెళ్లిపోవడం అధికారుల జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులకు లేదా? మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడం సమస్యకు పరిష్కారం అవుతుందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి..బాధితుడికి న్యాయం చేయాలి!

జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా బాధితుడి సమస్య పరిష్కారం కాకపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. కలెక్టర్ ఉత్తర్వులను అమలు చేయడంలో జాప్యానికి కారణాలేమిటో విచారణ జరపాలి. ప్రభుత్వ స్థలంలో ఎవరెవరు ఉన్నారు? బాధితుడిని ఖాళీ చేయించిన తర్వాత అదే స్థలంలో ఇతరులు ఎలా ప్రవేశించారు? బాధితుడి సామాన్లు, యంత్రాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలి.ప్రభుత్వ భూమిని పరిరక్షించడం అధికారుల బాధ్యతే అయినప్పటికీ, ఆ పేరుతో నిరుపేదల జీవనోపాధిని దెబ్బతీసి వారి సొంత వస్తువులను తిరిగి ఇప్పించకుండా ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని బాధితుడు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ మరోసారి జోక్యం చేసుకొని తన ఉత్తర్వుల అమలును పర్యవేక్షించాలని, బాధితుడి సామాన్లు, బీరువాల తయారీ యంత్రాలను పోలీసు రక్షణతో తిరిగి ఇప్పించాలని, ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని భాస్కర్ వేడుకుంటున్నారు.అధికారుల ఆదేశాలు కాగితాలకే పరిమితమా? క్షేత్రస్థాయిలో అమలు చేసేది ఎవరు? నిరుపేదకు న్యాయం జరిగే వరకు ఈ ప్రశ్నలకు సమాధానం రావాల్సిందే!

చేయూత పెన్షన్ లబ్ధిదారులకు శాంక్షన్ పత్రాల పంపిణీ

ముఖ్య అతిథిగా హాజరైన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


జనగామ నవంబర్ 17 (తెలుగు గళం)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చేయూత పెన్షన్ పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మూడవ వార్డుకు చెందిన పెన్షన్ లబ్ధిదారులకు వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి చేతుల మీదుగా పెన్షన్ మంజూరు పత్రాలను (శాంక్షన్ పత్రాలు) పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శాంక్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ రాజశేఖర్ రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, వైస్ చైర్మన్ భూష పర్వతాలు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మూడవ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంటుక దామోదర్ రెడ్డి, బాలాజీనగర్ ఏరియా ప్రతినిధులు, డాక్టర్ తిప్పారా యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.



హన్మకొండలో ఈ నెల 22న 'స్వేరో ఆత్మీయ సమ్మేళనం'





తెలుగు గళం న్యూస్ హన్మకొండ

ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 'స్వేరో ఆత్మీయ సమ్మేళనం' ఈ నెల 22న హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కాడపాక అనిల్ స్వేరో ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి మాజీ ఐపీఎస్ అధికారి,సామాజిక చైతన్యవేత్త డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.విద్య, ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, ఐక్యత వంటి స్వేరో భావజాలాన్ని బహుజన సమాజంలోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.స్వేరోస్ కుటుంబ సభ్యులు,బహుజన విద్యార్థులు,యువత,మేధావులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాడపాక అనిల్ స్వేరో పిలుపునిచ్చారు.

చలో మేడారం' పోస్టర్ ఆవిష్కరణ

ఉద్యమకారులు తరలిరావాలని పిలుపు



తెలుగుగళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

ఈ నెల 22న ఆదివారం ములుగు జిల్లా మేడారంలో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.మంగళవారం రేగొండ మండల కేంద్రంలో రేగొండ,కొత్తపల్లి గోరి మండలాల ఉద్యమకారుల ఫోరం సన్నాహక సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి మండల రవీందర్ రెడ్డి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పున్నం రవి,నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్ ముఖ్య అతిథులుగా హాజరై 'చలో మేడారం' పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్,వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో ఉద్యమకారుల హక్కులు, ఆత్మగౌరవం, స్థానిక సంస్థల్లో 20 శాతం టికెట్ల కేటాయింపు వంటి కీలక తీర్మానాలు చేస్తామన్నారు. కె.కేశవరావు కమిటీ కాలయాపన చేయకుండా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.వనదేవతలు సమ్మక్క-సారలమ్మ పోరాట స్ఫూర్తితో రేగొండ,కొత్తపల్లి గోరి మండలాల ఉద్యమకారులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పత్తి బుచ్చిరెడ్డి, కానుగంటి శ్రీనివాస్, మోడం ఉమేష్ గౌడ్, దాసరి తిరుపతిరెడ్డి, లింగంపల్లి ప్రసాద్ రావు, ఏడునూతుల విజయేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మైస బిక్షపతి, పట్టెం శంకర్, గోగుల అశోక్ రెడ్డి, సామర్ల శ్రీనివాస్, గుర్రాల సుమన్ రెడ్డి, మడికంటి ప్రభాకర్, రూపురెడ్డి లింగారెడ్డి, ఐలి నరేష్ గౌడ్, పసుల అశోక్, వెల్దండి అశోక్, సోమిడి మోహన్ రావు, గండి తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర

కడిపికొండలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట నియోజకవర్గం/నవంబర్ 17

కడిపికొండ (వర్ధన్నపేట): రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కాలనే లక్ష్యంతో కడిపికొండలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి"అని సూచించారు.రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గన్నీ సంచులు,తూకం యంత్రాలు, ఇతర సదుపాయాలన్నీ ముందుగానే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. కాజీపేట దర్గా పాక్స్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షులు జక్కుల సదానందం, 45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి, 46వ డివిజన్ అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, 64వ డివిజన్ అధ్యక్షులు దువ్వ శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు.తదితరులు పాల్గొన్నారు.

మానేరు వాగు నుండి అక్రమ ఇసుక రవాణా.. ట్రాక్టర్ సీజ్



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను రేగొండ పోలీసులు పట్టుకున్నారు.మంగళవారం ఉదయం కనీపర్తి గ్రామ శివారులో పోలీసులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో,కాటం కృష్ణ అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డాడు.వెంటనే వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు, డ్రైవర్ కమ్ ఓనర్ కృష్ణపై చట్టప్రకారం కేసు నమోదు చేశారు.అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపినా,రవాణా చేసినా ఉపేక్షించేది లేదని,అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై డి.సుధాకర్ హెచ్చరించారు.

పెద్దపెండ్యాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్ (తెలుగు గళం) నవంబర్ 17:

ధర్మసాగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో పెద్దపెండ్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రాథమిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం సకాలంలో కొనుగోలు చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉండేలా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సహకార అధికారి భూక్య మోహన్,నోడల్ అధికారి కృష్ణవేణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు,పెద్దపెండ్యాల గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు,పీఏసీఎస్ ధర్మసాగర్ డైరెక్టర్లు బొడ్డు లెనిన్,జంగా వీరయ్య, సెక్రటరీ పింగిలి రాజిరెడ్డి, పెద్దపెండ్యాల కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి కలకోటి మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్, పోలుమారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఉద్యమాలను నిర్మించడమే కామ్రేడ్ పల్లె యాదగిరికి నిజమైన నివాళి

కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, జిల్లా అధ్యక్షుడు బూడిద గోపి





స్టేషన్ ఘనపూర్ నవంబర్ 17(తెలుగు గళం)

సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, కల్లుగీత కార్మిక సంఘం సీనియర్ నాయకుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ నేత, ఇప్పగూడెం గ్రామ మాజీ సర్పంచ్ కామ్రేడ్ పల్లె యాదగిరి (75) మృతి కల్లుగీత కార్మిక ఉద్యమానికి, పీడిత ప్రజల పోరాటాలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, జనగామ జిల్లా అధ్యక్షుడు బూడిద గోపి అన్నారు.వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పల్లె యాదగిరి మంగళవారం తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని ఇప్పగూడెంలోని సీపీఎం గ్రామ కార్యాలయంలో ఉంచారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బూడిద గోపి మాట్లాడుతూ..కామ్రేడ్ పల్లె యాదగిరి కల్లుగీత కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడని కొనియాడారు.కార్యకర్తలను ప్రోత్సహించడంలో, యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపేవారని గుర్తుచేశారు. తనకంటే చిన్నవారైనా నాయకత్వ బాధ్యతలు చేపట్టిన వారిని ఎంతో గౌరవంగా, ఆప్యాయంగా పలకరిస్తూ ప్రోత్సహించేవారని అన్నారు.సీపీఎం నాయకుడిగా ఇప్పగూడెం, స్టేషన్ ఘనపూర్ పరిసర ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారని తెలిపారు.ఇప్పగూడెం గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. ఎన్నో ఆటంకాలు, నిర్బంధాలను ఎదుర్కొంటూ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.ఆయన చేసిన సేవలు, ఉద్యమాల్లో ప్రదర్శించిన పోరాట పటిమ, త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శమని అన్నారు.కామ్రేడ్ పల్లె యాదగిరి ఆశయాలను కొనసాగిస్తూ కార్మికులు, పేదలు, పీడిత ప్రజల హక్కుల కోసం మరిన్ని ప్రజా ఉద్యమాలను నిర్మించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మాచర్ల రఘురాములు, కుర్ర రాజు, నామాల యాదగిరి, బాల్నె రాజయ్య, ముసుగుంపుల నరేష్, గ్రామ కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పొగాకు సారయ్య, మందాపురం అంజయ్య, సట్ల యాదయ్య, చెట్ల బుక్కుల యాకయ్య, పల్లె లక్ష్మీనారాయణ, సట్ల రాజు, రామగోని సతీష్, రామగోని ప్రభాకర్, సట్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావంతో విద్యుత్ ఉత్పత్తికి ముప్పు... పొదుపే పరిష్కారం

విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించిన ఏఈ మునిగె కరుణాకర్



జాఫర్‌గఢ్ నవంబర్ 17(తెలుగు గళం)

ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై ఎదురయ్యే సమస్యలు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరంపై జాఫర్‌గఢ్ మండల విద్యుత్ శాఖ ఏఈ మునిగె కరుణాకర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎంఈఓతో కలిసి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గి జలవిద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు.అంతేకాకుండా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో యంత్రాలను చల్లబరిచేందుకు అవసరమైన నీటి లభ్యతపైనా ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు.విద్యుత్ కొరతను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపును అలవాటు చేసుకోవాలని ఏఈ సూచించారు. ఇళ్లలో ఎల్ఈడీ బల్బులు, ఫైవ్‌స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ ఉపకరణాలను వినియోగించాలని కోరారు. ఏసీల ఉష్ణోగ్రతను 24 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్యలో ఉంచడం ద్వారా సుమారు 20 నుంచి 30 శాతం వరకు విద్యుత్ ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు.ఎల్నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వేసవి తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు.అనంతరం విద్యార్థులతో ప్రకృతిని పరిరక్షించడం, విద్యుత్ మరియు నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు ఫోర్‌మెన్ జావీద్, ఏఎల్ఎం ప్రభాకర్, అన్మ్యాండ్ కృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

జనగామకు మంజూరైన ఏటీసీ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కు బిర్రు ఇస్తారి ఎక్స్ వేదికగా విజ్ఞప్తి



జనగామ నవంబర్ 17(తెలుగు గళం)

వెనుకబడిన జనగామ నియోజకవర్గ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మంజూరైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌లకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విజ్ఞప్తి చేశారు.జనగామ నియోజకవర్గానికి ఏటీసీ మంజూరై ఏడాది గడుస్తున్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఏటీసీ నిర్మాణం కోసం తొలుత చంపక్ హిల్స్ ప్రాంతంలో స్థలాన్ని కేటాయించగా, ఆ స్థలానికి సమీపంలో ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు వెళ్తుండటంతో నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఏటీసీ నిర్మాణానికి అనువైన మరో స్థలాన్ని వెంటనే కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థల సమస్యను పరిష్కరించి నిర్మాణ పనులు ప్రారంభిస్తే ఈ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఏటీసీలో వివిధ సాంకేతిక రంగాల్లో శిక్షణ పొందిన యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, స్వయం ఉపాధి దిశగా సొంత కంపెనీలు, సంస్థలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఇప్పటికే ఏటీసీ మంజూరైందన్న ఆనందం ఉన్నప్పటికీ, నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నిరాశ నెలకొందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌తో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని స్థల సమస్యను పరిష్కరించి జనగామ ఏటీసీ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా సహకరించాలని బిర్రు ఇస్తారి హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.